క్లుప్తంగా...

నేడు ఓయూలో మార్నింగ్ వాక్

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రపంచ పర్యావరణం దినోత్సవాన్ని పురస్కరించుకొని నేడు (5న) ఓయూలో మార్నింగ్ వాక్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటలకు ఆర్ట్స్ కాలేజీ నుంచి ఎన్‌సీసీ గేటు వరకు జరిగే వాకింగ్‌లో విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులు భాగస్వాములు కావాలని అధికారులు పేర్కొన్నారు. అనంతరం ఇంజినీరింగ్ కాలేజీ వద్ద సమావేశం ఉంటుందన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.29, నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 28, బెండకాయ 40, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 65, పచ్చకాకర 38, పందిరి బీర 45, క్యాబేజీ 15, క్యారెట్ 40, దొండ 28, గుండుబీన్స్ 105, గింజ చిక్కుడు 65, గోకరకాయ 45, కీర 25, దోసకాయ 15, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 13, ఆలుగడ్డ 20, చామగడ్డ 35, మొరంగడ్డ 17, కందగడ్డ 28, సొరకాయ 15, పొట్లకాయ 23, అరటికాయ 11, ముల్లంగి 4-6.

నేటి నుంచి క్రైస్తవ ఆధ్యాత్మిక సభలు

కంటోన్మెంట్: జేబీఎస్ సమీపంలోని కంటోన్మెంట్ ప్లే గ్రౌండ్‌లో నేటి నుంచి (సోమవారం) గురువారం వరకు క్రైస్తవ ఆధ్యాత్మిక సభలు నిర్వహించనున్నట్లు 'ది పెంతెకొస్తు మిషన్' చర్చి సెంటర్ పాస్టర్ శ్యామ్ సుందర్ ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ సభల్లో భాగంగా ప్రత్యేక బైబిల్ పఠనం, దైవిక స్వస్థతనిచ్చు ఆరాధనలు కొనసాగుతాయన్నారు. 'పెంతెకొస్తను పండుగ దినము వచ్చినప్పుడు అందరు ఒకచోట కూడియుండిరి.' అనే బైబిల్ వాక్యం ప్రకారం ప్రతి యేటా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. యెహోవా యొక్క ఏడు వార్షిక పండుగలు అంశం ప్రకారం ప్రతి రోజూ సాయంత్రం 6 గంటలకు రోగులు, విశ్వాసులకు స్వస్థత ప్రార్థనలు చేయబడుతాయని కుల మతాలకు అతీతంగా ఆహ్వానిస్తున్నామన్నారు.

కార్ఖాన పీఎస్‌లో 'ఓపెన్‌హౌస్'



ఆయుధాల పనితీరును తెలుసుకుంటున్న విద్యార్థులు

రసూల్‌పురా: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని నార్త్‌జోన్ కార్ఖాన పీఎస్‌లో సీఐ రవీందర్ ఆధ్వర్యంలో ఆదివారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పోలీస్‌స్టేషన్ పనితీరు, కమాండ్ కంట్రోల్ సిస్టం, సీసీటీఎన్ఎస్ అప్లికేషన్స్ వినియోగం, పోలీసుల ఆయుధాలు, ఎఫ్‌ఐఆర్ నమోదు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. నార్త్‌జోన్ అదనపు డీసీపీ రఫీక్, ఏసీపీ సుధీర్, రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేష్, బీఆర్ఎస్ కంటోన్మెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి, లాస్య నందిత, నివేదిత, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి, భాష్యం పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం




సర్టిఫికెట్ అందజేస్తున్న దృశ్యం

అడ్డగుట్ట: సికింద్రాబాద్‌లోని రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సౌత్ సెంట్రల్ రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. మే 1వ తేదీ నుంచి ఈ నెల 4 వరకు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో క్రికెట్, చెస్, ఫుట్‌బాల్, యోగా, జిమ్నాస్టిక్స్, హాకీ, కబడ్డీతో పాటు వివిధ క్రీడల్లో శిక్షణ అందించారు. ఆదివారం ముగింపు వేడుకలు నిర్వహించి వివిధ క్రీడల్లో శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు ఆర్కే సిన్హా, ఓఎస్‌డీ జేజే శోభ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ సన్‌షైన్-కిమ్స్ ఆధ్వర్యంలో ఆదివారం వెస్ట్ మారేడుపల్లిలోని పద్మశాలి కల్యాణ మండపంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసినట్లు వైద్యులు ప్రశాంత్, నివేదిత, హవ్య, శ్రీకాంత్, సుధాంశ్, పరిమల, హర్ష, కీర్తన పేర్కొన్నారు.

రైలు ప్రమాద మృతులకు నివాళి



రైల్ నిలయం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: ఒడిశా రైళ్ల ప్రమాదంలో మృతి చెందిన వారికి సామాజిక కార్యకర్త పిట్ల నగేష్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. సంగీత్ చౌరస్తా నుంచి కొవ్వొత్తులు ర్యాలీని రైల్ నిలయం వరకు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ వెంకటదాస్, మహేందర్‌రెడ్డి, పిట్ల శ్రీను, భవాని, రాము, సురేందర్ పాల్గొన్నారు.

అర్బన్ కమ్యూనిటీ .. మహిళల ప్రగతి



- ఆర్థిక స్వావలంబనకు నిరంతర కార్యక్రమాలు
- సత్ఫలితాలు సాధిస్తున్న యూసీడీ అధికారులు



ఇటీవల జరిగిన కార్యక్రమంలో పొదుపు సంఘాలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సికింద్రాబాద్: అర్బన్ కమ్యూనిటీ పేరుతో జీహెచ్ఎంసీ అధికారులు చేపడుతున్న సామాజిక కార్యక్రమాల ఫలితంగా సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలో సత్ఫలితాలు వస్తున్నాయి. మురికివాడల సమగ్ర అభివృద్ధి పేరిట కొనసాగుతున్న కార్యక్రమాల ద్వారా పేద, మధ్య తరగతి మహిళలకు ఆర్థిక స్వావలంబన చేకూరుతుంది. అంతేకాక సదరు మహిళలు సామాజిక ప్రగతి సాధించడం కోసం అర్బన్ కమ్యూనిటీ ప్రతినిధులు అవగాహన కలిగిస్తున్నారు. మరీ ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను మహిళల ముంగిట్లోకి తీసుకెళ్లడం కోసం వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

మహిళలను జాగృతం చేస్తూ..

ముందే ఎంపిక చేసుకున్న మురికివాడలు, బలహీన వర్గాలు నివసించే ప్రాంతాల్లోని మహిళలకు యూసీడీ ప్రతినిధులు తొలుత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తద్వారా వారందరిని ఏకతాటిపైకి తీసుకొచ్చి గ్రూపులుగా ఏర్పాటు చేస్తున్నారు. గ్రూపు సభ్యులకు పొదుపు చేసుకునే పద్ధతులను వివరించడం, బ్యాంకు రుణాలు ఇప్పించడంతో ఉపాధి అవకాశాలు చూపిస్తున్నారు. ఇక్కడి ఐదు మున్సిపల్ డివిజన్ల పరిధిలో 60 వరకు ఉన్న మురికివాడల్లో 65 వేల మంది మహిళలు నివసిస్తున్నట్టు అంచనా. ఈ ప్రాంతాల్లో పనిదినాల్లో పర్యటిస్తున్న అర్బన్ కమ్యూనిటీ అధికారులు పొదుపు సంఘాల పట్ల అవగాహన కలిగించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిరుపేదల ముంగిట్లోకి తీసుకు వెళ్తున్నారు.

1875 స్వయం సహాయక బృందాలు..

నియోజకవర్గంలో 1875 స్వయం సహాయక బృందాలు ఉన్నాయి. ఒక్కో గ్రూపునకు 10 మంది చొప్పున మొత్తంగా 18,750 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. ఏటా రూ.19 కోట్ల ఆర్థిక సహాయాన్ని బ్యాంకుల ద్వారా పొందుతుండడం గమనార్హం. మహిళలను స్వయం సహాయక బృందాలుగా ఏర్పాటు చేయడంతోపాటు యూడీసీ కమ్యూనిటీ అధికారులు సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. పరిసరాల పరిశుభ్రత, పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించడం, ఆరోగ్యం, ఆసుపత్రుల పట్ల అవగాహన కలిగిస్తున్నారు. చిరు వ్యాపారులు, వికలాంగులు, ఒంటరి మహిళలను గుర్తించి వారికీ అవసరమైన సహాయక చర్యలు అందిస్తున్నారు.

డివిజన్	అధికారి పేరు	మొబైల్ నెంబరు
అడ్డగుట్ట	ఉమాదేవి	8106396248
తార్నాక	శ్రీవాణి	9133111011
మెట్టుగూడ	ప్రేమ్‌చందర్	8247778976
సీతాఫల్‌మండి	ధనశ్రీ	77805 63322
బౌద్ధనగర్	వరుణ	9959647763

మురికివాడలు- 60
మహిళా సంఘాలు- 1875
సంఘాల సభ్యులు- 18,750
2022-23లో పొందిన రుణం- రూ.19 కోట్లు

మహిళలకు స్వయం ఉపాధి



అర్బన్ కమ్యూనిటీ సేవలు మహిళలకు ఎంతో ఊరట ఇస్తున్నాయి. చిన్న మొత్తాల పొదుపు చేసుకోవడంతో పొందే బ్యాంకు రుణాల ద్వారా ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. మహిళలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందుబాటులోకి తేవడం, పిల్లలకు విద్య ఆరోగ్యం పట్ల అవగాహన కలిగించడంలో యూసీడీ ప్రతినిధులు సహకరిస్తున్నారు.

– పవిత్రగౌడ్, పొదుపు సంఘం ప్రతినిధి

సామాజిక అభివృద్ధే ధ్యేయం



మురికివాడలు, పేదలు నివసించే ప్రాంతాల పరిస్థితులను పూర్తిగా అధ్యయనం చేస్తున్నాం. వారితో సమావేశాలు నిర్వహించి సామాజిక స్పృహను కలిగిస్తున్నాం. ఆర్థిక స్వాంతనను చేకూర్చుతున్నాం. విద్య, ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత పట్ల అవగాహన కల్పిస్తూ ఆశించిన ఫలితాలు రాబట్టుతున్నాం.

– ధనశ్రీ, కమ్యూనిటీ ఆఫీసర్

మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యం



మురికివాడల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా యూడీసీ కార్యక్రమాలు చేపడుతున్నాం. ముఖ్యంగా మహిళలకు ఆర్థిక, సామాజిక ప్రగతిని అందించడం కోసం ప్రాధాన్యం ఇస్తున్నాం. మురికివాడల ప్రజలకు పలు సామాజిక అంశాల పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

–టీ.దశరథ్, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్

బస్తీలపై బోర్డు చిన్నచూపు తగదు



పికెట్ లక్ష్మీనగర్ బస్తీవాసులతో మాట్లాడుతున్న క్రిశాంక్

కంటోన్మెంట్: బస్తీల అభివృద్ధి విషయంలో బోర్డు అధికారులు చిన్నచూపు చూస్తున్నారని తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె క్రిశాంక్ అన్నారు. కంటోన్మెంట్ నాలుగో వార్డు పికెట్ లక్ష్మీనగర్‌లో బస్తీనిద్రలో పాల్గొన్న ఆయన ఆదివారం ఉదయం ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేశారు. బస్తీవాసుల సమస్యలు తెలుసుకునేందుకు తాను గత పది వారాలుగా బస్తీనిద్ర చేస్తున్నానని తెలిపారు. దాదాపు అన్ని బస్తీల్లోనూ తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాల వంటి మౌలిక సదుపాయాల లేమి తీవ్రంగా ఉందన్నారు. బోర్డు అధికారులు ప్రత్యేక చొరవ చూపి బస్తీవాసులు తగిన సదుపాయాలు కల్పించాలన్నారు. బస్తీల వారీగా చేపట్టాల్సిన పనులతో ప్రత్యేక జాబితా రూపొందించి త్వరలోనే సీఈఓ మధుకర్ నాయక్‌ను కలిసి అందజేస్తామన్నారు. లక్ష్మీనగర్‌లో పలువురికి ఇళ్ల పట్టాలు లేవని, బస్తీకి గతంలో ఉన్న ఆర్టీసీ బస్సు సదుపాయాన్ని పునరుద్ధరించాలని, బస్తీలో ప్రమాదకర స్థితిలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చాలని తదితర సమస్యలను స్థానికులు క్రిశాంక్ దృష్టికి తీసుకొచ్చారు. జూన్ 9వ తేదీన మడ్‌ఫోర్ట్ స్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించే జాబ్‌మేళాను యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అశోక్, జ్ఞానేశ్వర్, జైకుమార్, భాస్కర్, గంగారామ్, సాయి వినీత్, సతీష్, కిశోర్, రోహిత్, మోనీ, రఘు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



అబ్దుల్ ఖయ్యూమ్ (ఫైల్)

రసూల్‌పురా: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కార్ఖాన పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. హస్మత్‌పేటలోని సిరాజ్ ఉల్-ఉలూమ్ మదర్సాలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న అబ్దుల్ ఖయ్యూమ్ (55) పని ఈ నెల 3వ తేదీ తన ద్విచక్ర వాహనంపై పాతబస్తీ మొఘల్‌పూరకు వెళ్లి ఆదివారం ఉదయం తిరిగి వస్తున్నాడు. బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు సమీపంలోని ఉడిపి హోటల్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. తీవ్రగాయాలు కావడంతో సమీపంలో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కాగా.. రోడ్డు ప్రమాదం జరగగానే స్థానికులు డయల్ 100, అంబులెన్స్ 108కి ఫోన్ చేసినా స్పందించకపోవడంతో ఆటోలో ప్రైవేటు ఆస్పత్రికి తరలించడం జరిగిందని అంబులెన్స్ సిబ్బంది స్పందిస్తే ప్రాణాలు దక్కేవని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవికుమార్ పేర్కొన్నారు.

నిర్మాణ రంగ కార్మికులకు ఆరోగ్య పరీక్షలు



హెల్త్ క్యాంప్‌లో పాల్గొన్న నాయకులు

లాలాపేట: నిర్మాణ రంగ కార్మికులకు సీఎస్‌సీ హెల్త్ కేర్ ద్వారా సంపూర్ణ ఆరోగ్య పరీక్షలు చేసేందుకు తెలంగాణ భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ మండలి కృషి చేస్తుందని అధికారులు తెలిపారు. ఆదివారం లాలాపేట లేబర్ అడ్డా వద్ద హెల్త్ క్యాంప్ నిర్వహించి సుమారు 100 మంది కార్మికులకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కృష్ణమూర్తి, రహమతుల్లా, నరసింహ, శ్రీనివాస్, మల్లేష్ పాల్గొన్నారు.

10న 'వార్డు' కార్యాలయాల ప్రారంభం!

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్‌లో జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయాల ప్రారంభం వాయిదా పడింది. గతంలో నిర్ణయించిన విధంగా కాకుండా ఈ నెల 10న వీటిని ప్రారంభించడానికి అధికారులు నిర్ణయించారు. గ్రేటర్‌లో జీహెచ్ఎంసీ పాలన వికేంద్రీకరణ లక్ష్యంగా వార్డు కార్యాలయాలను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. తొలుత ఈ నెల 2న వార్డు కార్యాలయాలను ప్రారంభించాలని నిర్ణయించగా పూర్తిస్థాయిలో వీటి ఏర్పాటు కానందున ఈ నెల 10న ప్రారంభించాలని అధికారులు నిర్ణయించినట్లు సమాచారం. చాలా ప్రాంతాల్లో ఎంపిక చేసిన భవనాలు ఇరుకుగా ఉన్నాయని అదే విధంగా ఆయా బస్తీ ప్రజలు వార్డు కార్యాలయాల ఏర్పాటుకు కమ్యూనిటీహాళ్లను ఇవ్వడానికి వ్యతిరేకిస్తున్నారు. దీంతో వార్డు కార్యాలయాల ప్రారంభంలో కొంత జాప్యం చోటు చేసుకుంది. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో ఈ నెల 10న ప్రభుత్వం సుపరిపాలన దినోత్సవం నిర్వహిస్తున్నారు. అయితే అదే రోజు వార్డు కార్యాలయాలను కూడా ప్రారంభించాలని మున్సిపల్ ఉన్నతాధికారులు నిర్ణయించినట్లు తెలిసింది. జీహెచ్ఎంసీ బేగంపేట్ సర్కిల్ పరిధిలో బన్సీలాల్‌పేట్ డివిజన్ గొల్లకొమురయ్య కాలనీ కమ్యూనిటీహాల్‌లో వార్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించగా స్థానిక బస్తీ కమిటీ వ్యతిరేకించింది. తాము బస్తీలో వివాహాది ఇతరత్రా శుభ కార్యాలు, కార్యక్రమాలు జరుపుకోవడానికి ఇబ్బంది అవుతుందనే కారణంగా ఇక్కడ వార్డు కార్యాలయం వద్దని బస్తీ ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. ఇప్పటికే బస్తీ కమిటీ ప్రతినిధులు రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి తమ వాదనను విన్పించారు. దీంతో ఇక్కడ వార్డు కార్యాలయం ఏర్పాటు విషయం కొంత సందిగ్ధతలో పడిందని తెలిసింది.



సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో అచ్చంపేట బల్మారంలో కొనసాగుతున్న పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో మల్లురవితో పాటు నగర ఉపాధ్యక్షుడు బేగంపేట రమేష్ పాల్గొని మద్దతు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఈ సందర్భంగా రమేష్ పేర్కొన్నారు. –సాక్షి, సిటీబ్యూరో

'ప్రజల కష్టాలు తీర్చేది కాంగ్రెస్ మాత్రమే'



మాట్లాడుతున్న ఆదం సంతోష్

అడ్డగుట్ట: ప్రజల కష్టాలు తీర్చేది కాంగ్రెస్ పార్టీ ఒక్కటేనని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆదం సంతోష్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన అడ్డగుట్ట డివిజన్ లాలాగూడలో బస్తీపోరు నిర్వహించి స్థానికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆదం సంతోష్ మాట్లాడుతూ.. నియోజకవర్గం పరిధిలో 10 వేల డబుల్ బెడ్రూమ్‌లు కట్టిస్తామని చెప్పి ఇప్పటి వరకు 500 కూడా పూర్తి చేయలేరని ఆరోపించారు. బౌద్ధనగర్ డివిజన్ పార్శిగుట్టను దత్తత తీసుకున్న సీఎం కేసీఆర్ ఎలాంటి అభివృద్ధి చేశారో చూపించాలని డిమాండ్ చేశారు. అడ్డగుట్ట ఏర్పడి 40 ఏళ్లు గడిచినా డ్రైనేజీ వ్యవస్థలో మార్పు రాలేదన్నారు. తొమ్మిదేళ్లలో బీఆర్ఎస్ పార్టీ ప్రజలపై అప్పుల భారం వేయడం తప్ప చేసిందేమీ లేదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమానికి కాంగ్రెస్ కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గద్దె దించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రజలు సంసిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో సునీత రావు, ఆదం సృజన్, కవిత, శ్రీనివాస్, అనిల్ కుమార్, జయరాజ్, రాజు సాగర్ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ప్రైవేటు విద్యా సంస్థలు అందుబాటులో ఉండాలి



విద్యార్థులను అభినందిస్తున్న చిరంజీవి

సికింద్రాబాద్: ప్రైవేటు విద్యా సంస్థలు అన్ని వర్గాల విద్యార్థులకు అందుబాటులో ఉండి బోధనలు అందించాలని ముషీరాబాద్ మండల విద్యాశాఖ అధికారి ఎస్.చిరంజీవి కోరారు. పేద మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా నివసించే ప్రాంతాల్లో వెలిసిన ప్రైవేటు పాఠశాలలు ఆయా తరగతులకు చెందిన విద్యార్థులను సామాజిక దృక్పథంతో చూడాలన్నారు. పది ఫలితాల్లో మండలంలోనే ఉత్తమ ఫలితాలు సాధించిన సీతాఫల్‌మండి శ్రీసాయి విద్యాలయ విద్యార్థులకు ఆదివారం నిర్వహించిన మెరిట్ అవార్డు ప్రదానోత్సవంలో ఆయన పాల్గొన్నారు. 10/10 టాపర్స్‌గా నిలిచిన ఎస్.జ్యోష్ణ, వి.తేజస్విని, పి.వీరమల్లిక, ఎం.మనస్వితలకు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున ప్రత్యేక నగదు అవార్డులను అందించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ కేఎస్.వెంకటేశ్, డైరెక్టర్ సుధా మాధవి, టి.శ్రీనివాస్‌రాజు, ప్రధానోపాధ్యాయుడు వి.కృష్ణమూర్తి హాజరయ్యారు.

అవగాహన సదస్సులను జయప్రదం చేయాలి



సమావేశంలో పాల్గొన్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

అడ్డగుట్ట: లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఈ నెల 11న నిర్వహించనున్న అవగాహన సదస్సును జయప్రదం చేయాలని జీఎల్‌టీ కోఆర్డినేటర్ సంపత్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం సికింద్రాబాద్‌లో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ రీజన్ అండ్ జోన్ కమిటీ సమావేశం సాదు శ్యామ్ ప్రసాద్ నేతృత్వంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎల్‌టీ సంపత్ గౌడ్ మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు అందిస్తున్న సేవల గురించి వివరించారు. ప్రజలకు మరిన్ని సేవలందించే విధంగా అందరూ కృషి చేయాలని సూచించారు. ఈ నెల 11న నాగోల్‌లో నిర్వహించనున్న అవగాహన సదస్సులో అన్ని లయన్స్ క్లబ్‌లకు చెందిన ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఆగస్టు 20న డిస్ట్రిక్ట్ ఇన్‌స్టలేషన్ కార్యక్రమంలో భాగంగా సాకేత్‌లోని వోర్ల కన్వెన్షన్‌లో హరిష్‌రెడ్డి డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జోనల్ చైర్మన్లు బి. శ్యామ్‌రావు, మల్లికార్జున్, కృష్ణ కుమార్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం



డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న రామకృష్ణ

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లోని అన్ని కాలనీల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యమని బోర్డు సభ్యుడు రామకృష్ణ అన్నారు. కంటోన్మెంట్ ఆరోవార్డు ఏడబ్ల్యూహెచ్ఓ సెక్టార్ సీ-కాలనీలో రూ.15.5 లక్షల బోర్డు నిధులతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కంటోన్మెంట్‌లో అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం లేదని స్థానిక నిధులతో తాము అభివృద్ధి చేస్తున్నామన్నారు. కంటోన్మెంట్ వాసులకు సరిపడా తాగునీటిని విడుదల చేయడంలోనూ ప్రభుత్వం వివక్ష చూపుతోందన్నారు. కార్యక్రమంలో భానుక మల్లికార్జున్, బాణాల శ్రీనివాస్, కాలనీ అధ్యక్షులు వీవీఎస్ రావు, ఉపాధ్యక్షులు ఎంవీ సుబ్బారావు, సెక్రటరీ రుమా ఆసీఫ్, సభ్యులు రవి చంద్రన్, విశాల్ పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం



రాంగోపాల్‌పేట్: మోండా కుమ్మరిగూడలోని రాజరాజేశ్వరీదేవి అమ్మవారి దేవాలయ వార్షికోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. భారీ సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం క్షీరాభిషేకాలు, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, దీక్షాధారణ, అఖండ దీపస్థాపన, కలశ సప్తశతి తదితర పూజలు నిర్వహించారు. పూజల్లో ఎర్రా శ్రీనివాస్, పద్మజ దంపతులు, వీరలక్ష్మి, ఎస్ఎస్ కుమారి, సక్కుబాయి. గున్నాల ప్రభావతి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి అలుపెరుగని కృషి

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ బండమైసమ్మనగర్ బస్తీని బంజారాహిల్స్ తరహా తీర్చిదిద్దడానికి నిర్మాణాత్మకమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం బండమైసమ్మనగర్ దేవాలయం నూతన ముఖద్వారాన్ని ఆయన కార్పొరేటర్ హేమలతతో కలిసి ప్రారంభించారు. అనంతరం బన్సీలాల్‌పేట్ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. ఒకప్పుడు బండమైసమ్మనగర్ బస్తీ సౌకర్యాల లేమీతో ఏ విధంగా ఉండేనో..అభివృద్ధితో ప్రస్తుతం ఇప్పుడు ఎలా ఉందో ఒక్కసారి ఆలోచించాలన్నారు. రానున్న కాలంలో ఈ ప్రాంతంలో వీడీసీసీ రోడ్లు వేయడంతో పాటు డ్రైనేజీ ఇతరత్రా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. బస్తీల్లోని కొంత మంది యువత చెడు వ్యసనాలకు అలవాటు పడుతున్నారని వారిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ ప్రాంతంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. బండమైసమ్మనగర్ బస్తీలో మిగిలిన డబుల్ బెడ్రూమ్‌ల సమస్యను పరిష్కరించి అర్హులైన పేదలకు అందజేస్తామన్నారు. అంతకు ముందు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు బన్సీలాల్‌పేట్ సేవా సంఘం నాయకులు భారీ గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఈఈ సుదర్శన్, డిప్యూటీ ఈఈ ఆంజనేయులు, శశాంక్, బన్సీలాల్‌పేట్ సేవా సంఘం అధ్యక్షులు మోహన్‌రావు, నాయకులు జయరామ్, కైలాష్, బాబురావు, సంతోష్, అర్జున్, శ్రీనివాస్, బాల్‌రాజ్, గుర్రం పవన్‌కుమార్ గౌడ్, లక్ష్మీపతి పాల్గొన్నారు. అంతకు ముందు మంత్రి బన్సీలాల్‌పేట్ డీ క్లాస్‌లో వీడీసీసీ రోడ్డు, చాచానెహ్రూనగర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు.

రోడ్డు విస్తరణను వేగవంతం చేయండి..

సనత్‌నగర్: ప్రధాన రహదారిలోని లోధా అపార్ట్‌మెంట్ వద్ద ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించి రోడ్డు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మంత్రి తలసాని అధికారులను ఆదేశించారు. సనత్‌నగర్‌లోని లోధా అపార్ట్‌మెంట్ పరిసరాలను ఆదివారం ఆయన వివిధ విభాగాల అధికారులతో కలిసి పర్యటించారు. తమ అపార్ట్‌మెంట్ ముందున్న ఆక్రమణలను తొలగించి ఫుట్‌పాత్ నిర్మించడంతో పాటు గ్రీనరీని ఏర్పాటు చేయాలని స్థానికుల విజ్ఞప్తి మేరకు స్పందించిన మంత్రి వెంటనే ఆక్రమణలను తొలగించాలని ట్రాఫిక్, టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఎర్రగడ్డ మెట్రోస్టేషన్ నుంచి ఫతేనగర్ ఫ్లైఓవర్ వరకు రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయని, ఈ పనులు పూర్తయితే అనేక సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఫతేనగర్ ఫ్లైఓవర్ విస్తరణ, సనత్‌నగర్ ఇండస్ట్రీయల్ ప్రాంతం నుంచి అండర్ పాస్ నిర్మాణం కోసం రూ.100 కోట్లు మంజూరయ్యాయని త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. ఫతేనగర్ ఫ్లైఓవర్ పక్కన ఉన్న కొన్ని నిర్మాణాలను ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి సేకరించిందని, వాటిని తొలగించిన అనంతరం ఫ్లైఓవర్ కింద కూడా రోడ్డు విస్తరణ జరపడంతో రాకపోకలు సులువుగా సాగుతాయని పేర్కొన్నారు. మంత్రి వెంట కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, జోనల్ కమిషనర్ రవికిరణ్, డీఎంసీ మోహన్‌రెడ్డి, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ రమేష్, హార్టికల్చర్ డీడీ శ్రీనివాస్, ఎలక్ట్రికల్ డీఈ సుధీర్ ఉన్నారు.